క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా హోమాలు



విశేషాలంకరణలో వాసవీమాత

గాజువాక : గాజువాకలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక హోమాలు, విశిష్ట పూజలను ఘనంగా నిర్వహించారు. ముక్కామలం పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ ఆధ్వర్యంలో 102 మంది కన్యలతో కన్యపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పూసర్ల వెంకటేష్, వైస్ చైర్మన్ కులుకూరి మంగరాజు, ప్రతినిధులు వూడ నానాజీ, చీమకుర్తి నానాజీ, తాళ్లూరి మల్లేశ్వరరావు, కేసారపు శ్రీను రమేష్, వూడ రాజా, ఏవీఎస్‌ఎన్ గుప్త, కొల్లా గుప్త తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలించాలి



పాల్గొన్న పయనీర్ మార్కెటింగ్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు దేవార్యన్ తదితరులు

అగనంపూడి: ఆధునిక మార్కెటింగ్ ప్రపంచ విశాలమైందని పయనీర్ మార్కెటింగ్ కార్పొరేషన్ సంస్థ వ్యవస్థాపకులు దేవార్యన్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ (విగ్మాట్–25) కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా వ్యాపార, వాణిజ్య రంగం విస్తృత పరిధి, అవకాశాలు వివరించారు. మార్కెటింగ్‌పై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలిస్తుంటే పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రిసోర్సెస్ మేనేజర్ ఇందిరా, బి.అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదరావు మాట్లాడారు.

నిరుపేద వధువుకు ఆర్థిక సాయం



పెళ్లి కూతురు, ఆమె తల్లికి నగదు అందిస్తున్న సేవా సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: నిరుపేద వధువుకు వివాహ ఖర్చుల నిమిత్తం సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, భావనా రుషి మార్కండేయ సేవా సంఘం చేయూత అందించాయి. అగనంపూడి దిబ్బపాలెంకు చెందిన నిరుపేద తల్లీకూతుళ్లు అద్దెంట్లో నివాముంటున్నారు. వీరికి ఇల్లు గడవడమే కష్టంగా ఉండడం, ఈ క్రమంలో వివాహ వయసు వచ్చిన కుమార్తెను పెళ్లి చేసుకోడానికి యువకుడు ముందుకు వచ్చాడు. ఆలయంలో వివాహం చేయడానికి కూడా స్తోమత లేకపోవడంతో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ట్రస్ట్ ప్రతినిధులు భావనా రుషిమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు కలిసి రూ.14వేలు అందించారు.

వడ్లపూడిలో పశువుల ఆస్పత్రి నెలకొల్పాలి



కణితిలో పశువుల శాలలో పశువులు

కూర్మన్నపాలెం : వడ్లపూడి పరిసర ప్రాంతాల్లో పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు అధికారులు పాతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వ మారడంతో వాటిని అధికారులు గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్ల అగనంపూడిలోని ఉన్న పశువైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని జంతు సంరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూర్మన్నపాలెం పరిధిలోని 86, 87 వార్డుల్లో సుమారు 2,200 గేదెలు, ఆవులు ఉన్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గొర్రెలు, మేకలు 3000 వరకు ఉంటాయని అంచనా. వీటి అన్నిటికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సుమారు 6–7 కిలోమీటర్ల దూరంలో ఉన్న అగనంపూడికి ఆస్పత్రి తీసుకువెళ్లాలి. దీంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సివస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వడ్లపూడి ప్రాంతంలో డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

డర్టీ పిక్చర్



కుంచమాంబ ఆలయం సమీపంలో గెడ్డ పరిస్థితి



75వ వార్డు నెల్లిముక్కు కుంచుమాంబ ఆలయ సమీపంలో చెత్తతో నిండిపోయిన గెడ్డ

ఎటు చేసినా చెత్తా చెదారమే దర్శనమిస్తోంది. ఏ గెడ్డ చూసినా పూడికలతో నిండిపోయి కనిపిస్తోంది. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ 75, 76వ వార్డు పరిధిలో ప్రధాన గెడ్డలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గెడ్డలు చెత్తాచెదారం, పూడికలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మురుగునీరు సాఫీగా పారకుండా అక్కడే నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే దోమలు కూడా విజృంభిస్తున్నాయి. ఒక పక్క దుర్వాసన, మరోపక్క దోమల బెడద కారణంగా స్థానికులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది. శానిటరీ అధికారులు ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. నెలలు తరబడి చెత్త పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

– పెదగంట్యాడ



75వ వార్డు నెల్లిముక్కు కుంచుమాంబ ఆలయ వెనుక చెత్తతో నిండిపోయిన గెడ్డ



గంగవరం పోర్టు వంతెన సమీపంలో ప్రధాన గెడ్డ పరిస్థితి

మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

గాజువాక : మహిళలు తమ హక్కుల కోసం ఐక్య ఉద్యమాలను సాగించాల్సిన అవసరం ఉందని ఐద్వా గాజువాక జోన్ అధ్యక్షురాలు కె.సంతోషం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలపై లైంగిక దాడులు ఖండించాలని, వినోదం కోసం మహిళలను ఆట వస్తువుగా చూడొద్దని, మహిళా కార్మికులపై పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు ఆపాలని, నిర్భయ చట్టాలను మరింత కఠినం చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళలకు ఇప్పుడున్న కొద్దిపాటి హక్కులు కూడా పోరాటాలతోనే సంక్రమించాయన్నారు. దేశాభివృద్ధిలో మహిళలు కూడా సమాన భాగస్వామ్యం కలిగి ఉన్నారన్నారు. అయినప్పటికీ మహిళలను ఇంకా ద్వితీయశ్రేణి పౌరులుగా చూసే పరిస్థితులున్నాయన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలోను, సమాన పనికి సమాన వేతనం అందించడంలోను ఇంకా వివక్ష పాటిస్తున్నారన్నారు. ఈ సమస్యలపై మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు జి.లక్ష్మి, చిన్నమ్ములు, సాయి, సరస్వతి, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.రాంబాబు, లోకేష్, గొలగాని అప్పారావు, శ్రీదేవి, పి.యశోధరాణి, స్వర్ణలత, వేణు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న రెడ్డి పావని, పరశురామరాజు తదితరులు

పెదగంట్యాడ: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎం పరశురామరాజు అన్నారు. భారతీయ జనతా మహిళా మోర్చా పార్టీ ఆదేశాలతో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాత రాజ్ ఆధ్వర్యంలో నడుపూరులోని ఉక్కు కళావేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. మహిళలు కేవలం వంటిల్లికే పరిమితం కాకూడదన్నారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిలకర్ర భువనేశ్వరి, దేవి, లలిత, కల్యాణి, మంజులా, జ్యోతి, ఆశాలత, పుష్పలత, జీలకర్ర రమణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఆత్మీయ సత్కారం



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కరణంరెడ్డి

గాజువాక : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు సత్కరించారు. విశాఖ ఉక్కు కోసం నిధుల కేటాయింపుతోపాటు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయ పన్నులు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా మార్పులు చేయడంపై ఈ సందర్భంగా ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ విచ్చేసిన ఆమెను ఎయిర్‌పోర్టులో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమాంబ, కుంచుమాంబ ఆలయాలు ప్రారంభం



అమ్మవార్లను దర్శించుకుంటున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వేదపండితుల ఆశీర్వాదం అందుకుంటున్న వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: నమో దుర్గమాంబ, నమో కుంచుమాంబ అంటూ భక్తుల నినాదాల మధ్య అమ్మవార్ల నూతన ఆలయం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ.. శిఖర ప్రతిష్ఠాపనను వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. గాజువాక ప్రాంతంలోనే అతిపెద్ద అమ్మవార్ల ఆలయాన్ని గ్రామ నాయకులు అహోరాత్రులు శ్రమించి నిర్మాణానికి తమ తోడ్పాటును అందించారు. దాతలు ఆలయ నిర్మాణానికి విరివిగా విరాళాలు అందజేశారు. గురువారం ఉదయం నుంచే అర్చకులు కోలపల్లి నరసింహమూర్తి శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు మండప పూజ, నవరత్నాన్యాసం, పీఠ పూజ, యంత్ర ప్రతిష్ఠ పూజ, విశేష లక్ష్మీ హోమం, కళా హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురంపై అమ్మవార్ల శిఖర ప్రతిష్ఠను బూరెలతో అభిషేకంతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధను నిర్వహించారు. అమ్మవార్లను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతపూటి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజు, కాంగ్రెస్ నాయకుడు గుడివాడ శ్రీనివాస్ దర్శించుకున్నారు.

సత్యసాయి రాష్ట్ర స్థాయి జూట్ బ్యాగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణా కార్యకమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీ

ఉక్కునగరం: సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జ్యూట్ బ్యాగుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. సత్యసాయి నూరవ జయంతి సందర్భంగా ఉక్కునగరం సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో పాటు సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి, ముఖ్యంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి అనేక శిక్షణా కార్యక్రమాలు సత్యసాయి సంస్థలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మాజి, టి.వి.వి. సత్యనారాయణ, అపర్ణ, సత్యసాయి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా

పెదగంట్యాడ: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిరసిస్తూ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఆందోళన చేయనున్నామని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8 గంటలకు మానవహారంగా ఏర్పడనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

అగనంపూడి: గృహ వినియోగదారులు విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరణ చేసుకోడానికి జూన్ నెలాఖరు వరకు గడువు విధించినట్టు ఆర్ఈసీఎస్ ఈఈ రామకృష్ణ తెలిపారు. 50శాతం రాయితీతో అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరణ చేసుకొనే వెసులుబాటు కల్పించామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఒక కిలోవాట్‌కు రూ.2,250 ఉండగా వాటిని రూ.1,250కు తగ్గించామని, అలాగే రెండు కిలోవాట్స్‌కు రూ.4,450 ఉండగా, రూ.2,450కు, మూడు కిలోవాట్‌కు రూ.6,650 నుంచి రూ.3,650కి, నాలుగు కిలోవాట్‌కు రూ.8,850 నుంచి రూ.4850కి, ఐదు కిలోవాట్స్‌కు రూ.11,050 నుంచి రూ.6,050కి తగ్గించామన్నారు. రాయితీ నాలుగు నెలలు మాత్రమే ఉంటుందని వినియోగదారులు సమీపంలోని మీ సేవా కేంద్రంలో లేదా ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో, గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో డంపర్, కారు ఢీ



డంపర్ టైరు కింద ఇరుక్కున్న కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో గురువారం మధ్యాహ్నం డంపర్, కారు ఢీకొన్న సంఘటనలో కారు ముందు భాగం నుజ్జు అయింది. సంఘటనలో కారు నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు. స్టీల్‌ప్లాంట్ సీఎంఎం విభాగానికి చెందిన అధికారి కారులో కోక్‌ఓవెన్స్ వైపు వెళ్తున్నారు. ఆర్‌ఎంహెచ్‌పీ విభాగం కూడలి వద్దకు వచ్చేసరికి అదే సమయంలో ఆర్‌ఎండీ విభాగం నుంచి వస్తున్న డంపర్, కారు ఢీకొన్నాయి. డంపర్ వెనుక టైరు కింద కారు ఇరుక్కు పోవడంతో కారు ముందు భాగం నుజ్జు అయింది. దాదాపు ఇంజన్ భాగం అంతా ధ్వంసమైంది. కారు నడుపుతున్న అధికారి క్షేమంగా బయటపడ్డారు. భద్రతా విభాగం అధికారులు పోలీసులకు సమాచారం అందజేశారు.

రహదారులు దారుణం

కల్వర్టులు, గెడ్డలు శిథిలం

పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు



అగనంపూడి కూడలిలో శిథిలమైన డ్రైనేజీలు, కల్వర్టు



అగనంపూడి కూడలిలో ఆస్పత్రి ఔట్ గేటు వద్ద కోతకు గురైన రహదారి



ఇన్‌గేటు పక్కన కోరుకుపోయిన రోడ్డు

అగనంపూడి: లంకెలపాలెం నుంచి కూర్మన్నపాలెం టోల్‌గేటు వరకు జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నగర పరిధిలో డివైడర్లపై అందమైన మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దడంలో ఉన్న శ్రద్ధ శివారు ప్రాంతాల్లోని రహదారులపై కనీసం దృష్టి సారించడం లేదు. రహదారులు, వంతెనల మరమ్మతులు, రహదారులకిరువైపులా ఉన్న డ్రైనేజీలు, కల్వర్టులు శిథిలమౌతున్నా, రహదారి కూరుకుపోతున్నా పట్టనట్టు వ్యవహరిస్తోంది. మూడు నెలల నుంచి టోల్‌గేటు నుంచి లంకెలపాలెం వరకు రహదారిపై బీటీచిప్‌తో లేయర్ వేసే పనులు నిర్వహిస్తున్నారు. లంకెలపాలెం నుంచి టోల్‌గేటు వరకు కూడా మధ్య మధ్యలో పనులు చేపట్టి వదిలేశారు. వంతెనలు, బస్టాప్‌లు, బస్‌బేలు వంటి ప్రదేశాలతోపాటు శిథిలమైన కల్వర్టులు, కోరుకుపోయిన రహదారి పక్కన డ్రైనేజీ నిర్మాణ పనులు గాలికి వదిలేశారు. దీంతో అగనంపూడి కూడలి, ఆస్పత్రి మెయిన్‌గేటు నుంచి ఔట్ గేటు వరకు డ్రైనేజీ శిథిలం కావడంతోపాటు కల్వర్టులు విరిగిపోయాయి. రోడ్లను ఆనుకొని ఉన్న డ్రైనేజీ గోడలు విరిగిపోయి రోడ్డు కోతకు గురవ్వడంతో బుధవారం వారపు సంతకు వచ్చేవారు, రోగులు, వారి బంధువులు,సహాయకుల వాహనాలు రోడ్డుమీద నిలిపితే.. పోలీసులు కేసులు బనాయిస్తున్నారు. కల్వర్టు, డ్రైనేజీలను పునర్నిర్మాణం చేపట్టి, కోతకు గురైన రహదారి వద్ద ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తే ఆస్పత్రికి వచ్చే వాహనాలు, సంతకు వచ్చే వాహనాలు ఆస్పత్రి గోడను ఆనుకొని కల్వర్టు మధ్యలో ఉన్న స్థలంలో నిలుపుకొనే వీలుంటుందని స్థానికులు అంటున్నారు. హైవే అథారిటీ అధికారులు స్పందించి సత్వరం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వరసిద్ధి వినాయకునికి సహస్ర పుష్పార్చన



వెండి పుష్పాలతో అర్చన చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 షాపింగ్ కాంప్లెక్స్ వరసిద్ధి వినాయకునికి గురువారం వెండి పుష్పాలతో సహస్ర పుష్పార్చన చేశారు. 19వ వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం వినాయకునికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఐ.వి. శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పుష్పయాగంలో వివిధ రకాల పూలతో స్వామికి అర్చన నిర్వహించారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంటు ఐటీఐలో స్కిల్‌హబ్ ద్వారా యువతకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక బ్యాచ్‌కు 30 సీట్లు ఉన్నాయని, ఈ నెల 15లోగా 8121743777 ఫోన్ నంబర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని నడుపూరుకు చెందిన నాగోతి సత్యనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత చెక్కును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.